ACCION FRATERNA
ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం జనవరి, 2009

FOR PRIVATE CIRCULATION ONLY

## విత్తన బ్యాంకుల ఏర్పాటు - వాటి ప్రయోజనాలు

రైతు మిత్రులారా !

ఈ మాసం మనం ఒక ముఖ్యమైన విషయాన్ని చర్చించుకుందాం. వ్యవసాయంలో మనకున్న సమస్యల్లా, పంటల పెట్టుబడులు ఎక్కువ కావడం. వర్షాధార పంటల్లో పంటలు బాగా పండినాయనుకుంటే పాత నష్టాల్ని బూడ్చి వేసే ఆదాయాలు ఉండవు. దీనితో రైతు తగు మాత్రం జీవించడమే కష్టతరమౌతుంది. ప్రకృతి అవాంతరాల వల్ల పంట నష్టం జరిగితే రైతుకు ఆ సంవత్సరం పెట్టుబడితోపాటు రైతు ఆదాయం కూడా నష్టమే. ఈసారి వర్షాలు ఎక్కువై బాగా వస్తాయనుకున్న పంటలు పోయినాయి. వట్టి కరువు స్థానంలో పచ్చి కరువు వచ్చిందన్నమాట. అవసరమయినపుడు వర్షాలు కురిసేటట్లు ప్రకృతిని మనం నియంత్రించలేము కానీ ప్రకృతికి అనుకూలంగానే మనం మన వ్యవసాయాన్ని కాపాడుకోవడమెలాగో దారులు వెతుక్కోవాలి. మొట్టమొదటిది తక్కువ ఖర్చుతో పంటలు పండించే విధానాల వ్యవసాయాన్ని గూర్చి ఆలోచించాలి. వాటిని గూర్చి అనేక విధాలుగా మనం చర్చించుకుంటూనే వస్తున్నాము. మనం ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే తక్కువ ఖర్చు వ్యవసాయం కనపడుతుంది. మన తాతలు వ్యవసాయాన్ని ఏ పద్ధతుల్లో చేశారు. ఏమేమి పంటలు పండించారు. ఏ ఎరువులు వాడేవారు. విత్తనాలు ఎక్కడి నుండి తెచ్చేవారు. ఇవన్నీ మనం ఒకసారి ఆలోచించుకోవాలి. అదే పద్ధతులను మక్కీకి మక్కీగా మనం ఈ రోజు అమలుపర్చాల్సిన అవసరం లేదుకానీ, ఆ పద్ధతులన్నీ ఆచరణ యోగ్యమైనవిగా ఈనాడు మనకు రుజువు అయినాయి. అవి రైతును కాపాడే విధానాలుగా కూడా అర్థం అవుతున్నాయి.

> నూతన సంవత్సరం 2009 సందర్భంగా రైతులకు, గొర్రెమేకల సంఘాలకు, సస్యమిత్ర గ్రూపు సభ్యులకు, సిబ్బందికి నా శుభాకాంక్షలు, విష రసాయనాలు లేకుండా, ఖర్చులేని వ్యవసాయం. అభివృద్ధి చెందడానికి మనమందరం మరింత పట్టుదలగా కలిసి పనిచేద్దాం. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకుందాం.
> **వై.వి.మల్లారెడ్డి,** డైరెక్టరు

### వ్యవసాయంలో విత్తనం ప్రాధాన్యత - మంచి విత్తనాల ఎంపికలో మహిళల పాత్ర

ఏ విత్తనం వేస్తే ఆ చెట్టు మొలుస్తుందని సామెత. ఒక విత్తనం వేస్తే మరో మొక్క మొలవదు. వ్యవసాయంలో విత్తనం ఎంపిక అత్యంత ప్రాధాన్యతగలదిగా ఉంటుంది. గతంలో విత్తన ఎంపిక చాలా వరకు మహిళలే చూసుకునేవారు. పొలాన్ని అదును చేయడం పురుషుని వంతైతే, ఆ పొలంలో ఏ ఏ విత్తనాలు వేయాలో నిర్ణయించేది మహిళ. తిండిగింజలతోపాటు, ఇంటికి కావలసిన రకరకాల పప్పుధాన్యాలు, కాయగూరల విత్తనాలు అక్కిళ్ళలో వేసేవారు. పూర్తిగా వ్యాపార పంటలలో మునిగిపోయిన తర్వాత వ్యవసాయంలో మహిళల ప్రాధాన్యత ఏమేరకు తరిగి పోయిందో ఆమేరకు విత్తనం కోసం మార్కెట్టు మీద ఆధారపడడం ఎక్కువయింది. అందుకే వ్యవసాయాన్ని ఆహార భద్రతతో పాటు లాభసాటిగా మార్చుకునే ప్రయత్నంలో భాగంగా వ్యవసాయంలో మహిళలు ప్రధాన పాత్ర వహించాలి. వారు మరింత చొరవ తీసుకోవాలి. కుటుంబానికి కావలసిన తిండి విషయమై మహిళకు తెలిసినంతగా పురుషునికి తెలియదు. మహిళ అయితే ఏ ఆర్థిక సూత్రాలు చదవకనే వ్యవసాయ లాభనష్టాల్ని ఆహార భద్రతను, చక్కగా అంచనావేసుకోవగలదు. పొదుపుగా గౌరవంగా, ఆరోగ్యంగా సంసారాన్ని నడుపుకోగలదు.

మన సంప్రదాయ విత్తనమే చాలా మంచి విత్తనం. ఎందుకుంటే ఏ ప్రాంతపు వాతావరణానికి ఆ ప్రాంతవాసులు అలవాటు పడినట్లే స్థానిక వాతావరణానికి అనువుగా స్థానిక విత్తనం అలవాటు పడి అభివృద్ధి చెంది ఉంటుంది. అందుకే మార్కెట్టులో ఎన్ని రకాల విత్తనాలున్నా, స్థానికంగా పండించే పంటల విత్తనమే మంచిది. స్థానిక విత్తనం ప్రాముఖ్యత పెరగాలంటే, నాణ్యమైన విత్తన సేకరణ, ఎంపికలలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి. దీనిని దృష్టిలో ఉంచుకునే మన సంస్థ గడిచిన 4-5 సంవత్సరాలుగా అపరాలు, కాయగూరలు విత్తనాలు గ్రామాల్లోని మహిళలకు అందిస్తూనే ఉంది. మార్కెట్టు మాయాజాలంలో పడి సంప్రదాయ విత్తనం మరచిపోయిన మన రైతులకు తిరిగి సంప్రదాయ విత్తనం వైపు మళ్ళించడమే మా ప్రధాన ఉద్దేశ్యం.

### గ్రామాల్లో విత్తన బ్యాంకులు

ఇదేమీ కొత్త ఆలోచనకాదు. మన పెద్దలు, ముఖ్యంగా స్త్రీలు వారి పొలాలకు కావలసిన అన్ని రకాల విత్తనాలను తమ పంటలలోంచి నాణ్యమైన కంకులు, కాయలు తీసి భద్రపర్చుకునేవారు. తమ తమ పంటలలో నాణ్యమైన విత్తనాలు ఏవైన తక్కువయితే పక్క రైతుల నుండి బంధువుల నుండీ తెచ్చుకునేవారు. చాలా వరకు ఒక గ్రామంలో ఉండే రైతుల అవసరాలకు ఆ గ్రామంలోని రైతుల విత్తనం నుండే పరస్పరం ఇచ్చిపుచ్చుకునే పద్ధతుల మీద జరిగేవి. వీటికి విత్తన బ్యాంకులు అన్న పేర్లు ఉండేవి కావు కానీ, గ్రామాలలో ప్రతి రైతు ఇల్లు ఒక విత్తన బ్యాంకుగా ఉండేది. రైతు మహిళలే వాటి సంరక్షకులు.

ఈ విధంగా గ్రామాల్లో విత్తన బ్యాంకులు అభివృద్ధి పర్చాలనే ధ్యేయంతో గత సంవత్సరం దాదాపు 235 గ్రామాలలో సంస్థ వివిధ రకాల ఆహార పంటల విత్తనాల్ని సమకూర్చింది. ఒకొక్క గ్రామంలో 50 నుండి 70 మంది రైతులకు కొర్రలు, జొన్నలు, నువ్వులు, పెసర, అలసంద విత్తనాలను రైతులకు బయట గ్రామాల నుండి సేకరించి ఇవ్వడం జరిగింది. అందుకు చాలా మంది రైతులు, ముఖ్యంగా స్త్రీలు సంతోషం వ్యక్తం చేశారు. కూడేరు మండలంలోని మదిగుబ్బ గ్రామంలోని చిన్నపరెడ్డి అనే వ్యక్తి రెండు ఎకరాలలో పూర్తి కొర్ర పంటనే వేసినాడు. కొర్ర బాగా పండింది. రెండు ఎకరాలకు 10 మూటల దిగుబడి వచ్చింది. మూట 1,100/- లెక్కన 11,000/- ఆదాయం వచ్చింది. ఎరువులు వేయలేదు. మందుల ఖర్చులేదు. విత్తనం చిన్న విత్తనం కాబట్టి ఖర్చు నామమాత్రమే. అలాగే రాప్తాడు, కనగానిపల్లి మండలాలలో కొంతమంది రైతులు ఒకే పంటగా కందిని మాత్రమే వేసినారు. పంటకాలానికి రైతులు మార్కెట్టుకు విత్తన కొనుగోలుకు వెళ్ళకుండా గ్రామాలలో రైతుల వద్దే నాణ్యమైన విత్తనాలు ఉండి తీరాలన్న అభిప్రాయంతోనే విత్తన బ్యాంకుల ఏర్పాటుకు సంస్థ శ్రీకారం చుట్టింది. విత్తనాలు తీసుకున్న రైతులు తిరిగి విత్తనమే బదులుగా ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ విత్తనం వెనక్కు ఇవ్వలేని సందర్భాలలో విత్తనం ఖరీదు చెల్లించాల్సి ఉంటుంది. అలా వసూలైన డబ్బు గ్రామలలోనే ఉండిపోతుంది. తిరిగి గ్రామంలోని రైతులకు విత్తన బ్యాంకుకు →

“భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది” ఉపనిషత్తులు

నిధిగా ఉపయోగ పడుతుంది. వ్యవసాయాన్ని ముఖ్యంగా మెట్ట వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలని, వ్యవసాయంలో పెట్టుబడుల అవసరం లేకుండా చేయాలన్నదే సంస్థ ఆశయం. ఈ సదవకాశానికి రైతులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ ఉన్నాను.

## విత్తన బ్యాంకుల నిర్మాణ స్వరూపం - వాటి పని విధానం.

ఎకాలజీ సంస్థ పనిచేస్తున్న ప్రతి మండంలోనూ 12 నుండి 20 గ్రామాలను విత్తన బ్యాంకు గ్రామాలను ఎంపిక చేశాము. ప్రతి గ్రామంలోనూ 25 నుండి 30 మంది దాకా రైతులతో సస్యమిత్ర గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి గ్రూపుకు ఒక మహిళ కన్వీనర్‌గానూ, పురుషుడు కో-కన్వీనర్‌గానూ ఎంపిక చేశాము. ఇలా ప్రతి గ్రామంలోనూ 5 నుండి 7 దాకా గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి గ్రూపులోని కన్వీనర్, కో-కన్వీనర్లతో గ్రామ స్థాయిలో గ్రామ సస్యమిత్ర సమాఖ్య (యస్.యస్.జి) ఏర్పాటు చేయడం కూడా జరిగింది. ఈ సమాఖ్య అవసరాన్ని బట్టి 5 లేదా 7 లేదా 9 మంది వరకూ సభ్యులుంటారు. ఇందులోని ఒక మహిళా సభ్యురాలితో ఎకాలజీ సెంటరు సిబ్బంది ఒకరితో కలిసి బ్యాంకులో జాయింట్ అకౌంటు ఏర్పాటు చేయడం జరుగుతున్నది. గతంలో గ్రామంలో ఇచ్చిన విత్తనాల ఖరీదు వసూలయిన డబ్బుకు తోడు ప్రతి గ్రామానికి సెంటరు సమకూర్చే 15 వేల నిధిని ఈ బ్యాంకులో జమ చేస్తారు. గ్రామంలో ప్రతి రైతుకూ కావలసిన విత్తనం, వాటి నిర్వహణ, అన్నీ సస్యమిత్ర సమాఖ్య సభ్యులు బాధ్యత వహిస్తారు. ఈ సస్యమిత్ర సమాఖ్య సభ్యులు ఈ క్రింది విషయాలపట్ల శ్రద్ధ వహిస్తారు.

1. పంటకాలానికి ముందే గ్రామంలో ఎంతమంది రైతులకు ఏ రకం విత్తనం ఏ మేరకు కావాలో ఎంత విస్తీర్ణానికి కావాలో అంచనా వేస్తారు. దీని కోసం మొదట సస్యమిత్ర గ్రూపులో అంచనాలు తయారు చేసి గ్రామ సస్యమిత్ర సమాఖ్యకు అందిస్తారు.
2. గ్రామ మొత్తానికి గ్రామంలో రైతుల వద్ద ఉన్న విత్తనం పోను ఎంతమేరకు విత్తనం కావలసినదీ, అంత విత్తనం ఇతర రైతుల నుండి కొనుగోలు చేస్తుంది. విత్తన సేకరణలో వాటి నాణ్యత, ధర, రకంలాంటి అన్ని విషయాలు గ్రామ సస్యమిత్ర సభ్యులు చూసుకుంటారు.
3. సమాఖ్య ద్వారా రైతులకు ఇచ్చిన విత్తనానికి ధర రూపంలోగానీ అవసరమైన సందర్భంలో తిరిగి విత్తన రూపంలోగానీ సమాఖ్య రైతుల నుండి వసూలు చేస్తుంది.
4. గ్రామంలో రైతులకు విత్తన పంపిణీలో సంప్రదాయ విత్తనం మాత్రమే ఉండే విధంగానూ, అంతర పంటలు, తిండి గింజల పంటల విత్తనాలు ఉండే విధంగానూ సమాఖ్య కృషి చేస్తుంది.
5. విత్తన సమాఖ్య సభ్యులే విత్తన నిలువ బాధ్యత తీసుకుంటారు. సెంటరు సిబ్బంది సహాయంతో రికార్డులు నిర్వహిస్తారు.
6. సెంటరు సంబంధిత ఏరియా టీము లీడరు రికార్డులను పరిశీలించి వాటి నిర్వహణలో తగు సూచనలు, సలహాలు అందజేస్తాడు.

## విత్తనాన్ని నిలువ వుంచుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

విత్తనాన్ని సక్రమమైన పద్ధతిలో నిలువ వుంచుకోకపోతే మరుసటి సంవత్సరానికంతా విత్తనం పురుగులపాలై పనికి రాకుండాపోతుంది. అందుకు సక్రమంగా నిలువ ఉంచడం చాలా అవసరం. మనకందరికీ తెలుసు. విత్తనం కోసం మంచి కంకులను కాయలను ఏరి వాటిని బాగా గాలికి ఆరనిస్తారు. కందులు, అలసందలు, పెసలు, కొర్రలు, జొన్నలు లాంటివాటిని నిలువ ఉంచే మట్టికుండలు, పాత్రలలులాంటి వాటిని పశువుల గంజుతో కానీ, వేపనూనెతోగానీ శుభ్రపరచి ఎండలో బాగా ఎండబెట్టాలి. ముఖ్యంగా విత్తనంలో తేమ శాతం లేకుండా జాగ్రత్తపడాలి. విత్తనాలను నేరుగా సూర్య రశ్మికి ఎండబెట్టకుండా నీడలో ఆరబెట్టాలి. బాగా ఆరిన తర్వాత వాటిని సంబంధిత పాత్రలలో పోసి, తేమలేని వేపాకును కలిపి మూతలు బాగా బిగించి గాలి, తేమ తగలని చోట విత్తనాన్ని నిలువ వుంచాలి. మన ప్రాంతంలో విత్తనాలకు బూడిద పట్టించి ఉంచడం అలవాటుగా ఉంది. ఇది కూడా మంచిదే. బూడిద పట్టించిన విత్తనానికి పురుగు ఆశించదు. విత్తనంలో తేమ ఉంటేనే పురుగు ఆశిస్తుందనే విషయాన్ని మనం మరువరాదు. ప్రస్తుతానికి గ్రామం మొత్తం మీద ఒకో చోట విత్తనాల్ని నిలువ వుంచే అవకాశాలు లేవు గనుక, గ్రామ సస్యమిత్ర సమాఖ్య సభ్యులు సమిష్టిగా బాధ్యత వహించి వారి అనుకూలం కొద్దీ విత్తనాన్ని నిలువ ఉంచాలి.

అదే విధంగా అనంతజ్యోతి, కె6 లాంటి కొత్త వేరుశనగ రకాలను కూడా మన రైతులు విత్తనోత్పత్తి కోసం సాగుచేస్తున్నారు. పోయినసారి వర్షాలవల్ల వేరుశనగ పంట బాగా నష్టమైందన్న విషయం మనకందరికీ తెలుసు. సరిగ్గా పూత దశలో ఒరుపు ఉండాల్సిన సమయంలో వర్షాలు వరుసగా కురవడంతో ఊడలు దిగక కాయలు కాలేదు. ఈ పంట నష్టాల్ని బేరీజు వేస్తే, పాత రకం టి.యం.వి.2 రకం పంట బాగా నష్టానికి గురయితే, అనంతజ్యోతి, కె6 లాంటి కొత్త రకం పంటలు అంతగా నష్టానికి గురికాలేదని మన పరిశీలనలో వెల్లడయింది. దీనివలన టి.యం.వి.2 రకం వేరుశెనగ స్థానంలో కొత్త రకం వేరుశనగ పంటలను విస్తరించుకోవాలి. దీనికిగానూ ఈ పంటల కాయలను విత్తనాల కోసం తగు జాగ్రత్తలతో భద్రపరుచుకోవాలి.

వేరుశనగ గింజలలో తేమ 9 నుండి 11 శాతం కన్నా తక్కువ ఉండేలా విత్తనం కాయలను నీడలో ఆరబెట్టాలి. తేమ శాతం అధికంగా ఉంటే, వాటికి తొందరగా పురుగు పట్టే అవకాశం ఉండడమే కాకుండా, కాయలలో అఫ్లోటాక్సిన్ అనే శిలీంద్ర విషపదార్థం అభివృద్ధి చెందుతుంది. విత్తనాల్ని కాయల్ని నిలువ ఉంచే గదులలో పురుగులు వ్యాప్తి చెందే ఇతర విత్తనాలు కానీ, ధాన్యము కానీ ఉంచరాదు. గదిగోడలకు వేప నూనె పిచికారి చేయాలి. కాయల్ని నింపే సంచుల్ని సాధ్యమయినంత వరకూ కొత్త సంచుల్ని ఎంపిక చేసుకుని, వాటికి, కిరోసిన్ కలపిని ద్రావణంలో ముంచి తేమలో ఎండనిచ్చిని తరువాత వరుసకు వరుసకు 2-3 అడుగుల ఖాళీ స్థలం వదిలి సంచులు నెట్టువేసుకోవాలి. అప్పుడప్పుడూ సంచులను పరిశీలిస్తూ, అవసరమైతే వేపనూనె, కిరోసిన్ ద్రావణాన్ని పిచికారీ చేస్తూ వుంచాలి.

## విత్తన బ్యాంకు ద్వారా ఆశించే ప్రయోజనం :

ముఖ్యంగా పంటలు పెట్టడంలో ఖర్చులు లేకుండా సాధ్యమయినంత మేరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం మొదటిది. రైతు విత్తనాల కోసం జన్యుస్వచ్ఛత, నమ్మకంలేని విత్తనాలు మార్కెట్టులో కొనే విత్తనాలకు రోగాలు ఎక్కువ వస్తాయి. వాటి కోసం వారు చెప్పే పురుగు మందులు వాడాల్సి ఉంటుంది. దీని ద్వారా రైతుకు ఆర్థికంగా భారంత కావడంతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుంది. వ్యవసాయ ఉత్పత్తులలో విష అవశేషాలు చోటు చేసుకుంటాయి.

రెండవ ఉద్దేశ్యం రైతుకు ఆహార భద్రత చేకూర్చడం. బహుళ పంటలు, అంతర పంటలు, ఆహార పదార్థాల పంటలను పండించడానికి ప్రోత్సాహం ఇవ్వడం. దీని ద్వారా రైతు కుంటుంబానికి పుష్టికరమైన ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం సమకూరేటట్లు చూడడం, ఆహార భద్రతను కాపాడడం.

మూడవది మన వారు ఏమేమి పంటలు పండించేవారో అవన్నీ కూడా ఈ వాతావరణానికి, మన తిండి అవసరాలకు సరిపడేవి, చీడ పీడలకు తట్టుకొని నిలబడగలిగేవి. వాటిని తిరిగి మనం రైతుల వద్దకు చేర్చాలి. కొర్రలు, రాగులు, జొన్నలు తిరిగి ఆహార అలవాట్లలోకి తేవాలి. పెసలు, కందులు, అలసందలు, ఉలవలు లాంటి పప్పు ధాన్యాలు శరీరానికి కావలసిన మాంసకృత్తులను అందిస్తాయి. ఇవి వాడుతూ ఉంటే డాక్టర్ల అవసరమే రాదు. **ఆరోగ్యకరమైన పంటల ద్వారా ఆరోగ్యకరమైన తిండితో ఆరోగ్యకరమైన సమాజం నిర్మించడమే ముఖ్య ఉద్దేశ్యం.** మనం అందరం గట్టి నిర్ణయం తీసుకుని చిత్త శుద్ధితో కృషి చేస్తే సాధించలేనిది ఏమీ లేదు. ప్రతి ఇల్లూ సంపూర్ణ ఆహార భద్రతగల ఇంటిగా మార్పు చెందాలని ఆశిస్తూ...

మీ శ్రేయోభిలాషి,

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి సెంటరు**

# సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

## బి.టి. పత్తి వచ్చింది, ఇక బి.టి. వంకాయ రాబోతోంది.

బి.టి.పత్తి పండించడం ద్వారా రైతులకు మంచి లాభాలు వస్తాయని. ముఖ్యంగా పత్తిలో కాయతొలిచే పురుగు రాదని బి.టి. పత్తి విత్తనాన్ని ఉత్పత్తి చేసే కంపెనీలు ప్రచారం చేస్తున్నాయి. పైర్లకు రోగాలు రాకుండా ఉండాలంటే సేంద్రీయ వ్యవసాయ విధానాలు పరిష్కారమని ఈ కంపెనీలు చెప్పవు. ఎందుకంటే అలా చెబితే వాటి వ్యాపారాలు పడిపోతాయి. రైతులను, పంటలను నాశనం చేస్తూ కోట్లు సంపాదించే ఈ పురుగు మందుల, విత్తనాల కంపెనీలు వాస్తవాల్ని చెప్పవు. మనం బి.టి. విత్తనాలను గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి. అదేమిటో తెలుసుకుందాం.

సాంకేతిక పరిజ్ఞానం ద్వారా బి.టి. అనే సంక్షిప్త నామంతో పిలువబడే నేలలో ఉండే ఒక క్రిమిని పంటలో ప్రవేశపెడతారు. దీనికి వారు చెప్పే సమాచారమేమంటే దీనివల్ల రోగాలురావని. అయితే ఈ క్రిమి విత్తనం ద్వారా మొక్కలలో జీవిస్తూ, పంట ఉత్పాదనల్లో చోటు చేసుకుంటుంది. వీటి ఆకులు, వ్యర్థాలు తిన్న పశువుల ఆరోగ్యాలు దెబ్బతింటాయని, బి.టి.సాంకేతిక పరిజ్ఞానం ఉన్న విత్తనాలు వ్యవసాయోత్పత్తులు మనుషులు ఉపయోగిస్తే, మనుషుల ఆరోగ్యాల మీద తీవ్రమైన ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు ఆందోళన చేస్తూనే ఉన్నారు.

ఇపుడు బి.టి. విత్తనం వంకాయ విత్తనం రూపంలో రాబోతోంది. సామాన్య ప్రజలకు ప్రధాన ఆధరవుగానూ, రుచిగానూ ఉండే వంకాయ మీద ఈ కంపెనీల కన్నుపడింది. వారు బి.టి.వంకాయ విత్తనాన్ని విడుదల చేస్తున్నారు.

ఈ వంకాయ గనుక తింటే, ఆ విషపదార్థం శరీరంలో చోటుచేసుకుని, శరీర సహజధర్మాలను ఆటంక పరుస్తుంది శరీరం చాలా వరకూ చిన్న చిన్న రుగ్మతలను అదే నయం చేసుకుంటుందన్న విషయం మీకు తెలుసు కదా, పడిశం వస్తే మందు వేయకుండానే తగ్గిపోతుంది. జ్వరం వస్తే, రెండు మూడు రోజులలో తగ్గిపోతుంది. గాయమైతే 5-6 రోజులలో ఎండిపోతుంది. శరీరం తనకు తానుగా నిర్వహించే ధర్మం. బి.టి. పంటల ఉత్పాదనలు తింటే, ఈ శరీర ధర్మానికి ఆటంకం ఏర్పడుతుంది. ఏమైనా తీవ్రమైన జబ్బులువస్తే, అధిక మోతాదులో రోగ నిరోధక మందులు వాడాల్సి ఉంటుంది. ఈ విషయాలమీద ప్రపంచవ్యాప్తంగా పరిశీలనలు జరిగినాయి. అందులో తేలిందేమంటే, ఇవి తిన్న ఎలుకల కాలేయం, కిడ్నీలాంటి శరీర భాగాలు దెబ్బతింటున్నాయని తేల్చారు.

కాబట్టి మన రైతు సోదరులకు మనవి చేసేదేమంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ బి.టి. వంకాయ విత్తనం కోసం వెళ్ళవద్దు. వ్యాపారుల మాయమాటలు నమ్మవద్దు. మీకేమైనా సందేహాలుంటే, వివరణలు కావాల్సి వస్తే, ఎకాలజీ సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారు. మన రాయదుర్గం వంకాయ, మన ముళ్ళ వంకాయను మాత్రమే తిందాం. రుచికరమైనవి, పోషకాల విలువలు కలిగినవి. అపాయం లేని వాటిని మాత్రమే పండిద్దాం.

(4వ పేజీ తరువాత)

పెరిగింది. పొలంలో అక్కడక్కడ పచ్చ పురుగు కనపడితే కిరోసిన్, వేపనూనె ద్రావణంతో పిచికారీ చేశాడు. పశువుల ఎరువు, గంజు, ఇంగువ, అపరాల పిండి కలిపి 5-6 రోజులు కుళ్ళబెట్టిన తరువాత తయారయిన జీవామృతాన్ని పొలంలో చల్లాడు. మరియొక రెండు సార్లు వేపనూనె ద్రావణాన్ని పిచికారి చేశాడు. పంట బాగా పెరిగింది. బాగా ఊడలువచ్చినాయి. పంట ఒడిపిన తరువాత అదృష్టం అనంతజ్యోతి రకం ద్వారా తనను వరించిదనుకున్నాడు.

2 1/2 ఎకరం పొలానికి 10 బండ్ల కట్టె వచ్చింది. ఒలిపించిన తరువాత 70 మూటల కాయలు అయినాయి. ఇంత పంటగానీ, పండిన పంటలో ఇంత మిగులు బాటుకానీ నరసింహులు తన జీవితంలో చూడలేదు. ఖర్చులేకుండా, పురుగు మందులు, రసాయనిక ఎరువులు లేకుండా పంటలు పండించడం సాధ్యమయిందని సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఒక వేరుశనగ విత్తనం ఖరీదు తప్ప మిగతా ఖర్చులన్నీ చాలా స్వల్పం. రైతు చెప్పిన మాటల్లో 2 1/2 ఎకరాల అనంతజ్యోతి సాగుకు అయిన ఖర్చు, ఆదాయం ఈ విధంగా ఉంది.

| | | |
|---|---|---|
| 1) | పొలం వేసవి దుక్కులు అదును | స్వంత కష్టం |
| 2) | గొర్లమంద తోలినందుకు రెండు రోజుల ఖర్చు | 1,200-00 |
| 3) | అనంత జ్యోతి 6 మూటల కాయల ఖరీదు రూ1,120/- వంతున | 6,720-00 |
| 4) | 9 మంది కలుపు కుళ్ళు ఒక్కొక్కరికి రూ.50/- వంతున | 450-00 |
| 5) | మూడు కేజీల వేపనూనె 50/- వంతున | 150-00 |
| 6) | ఇతర దినుసులు, అపరాలు | 150-00 |
| 7) | కాయలు విడిపించిన దానికి అయిన కూళ్ళు (అందాజుగా) | 2,500-00 |
| | **మొత్తం ఖర్చు** | **11,170-00** |
| | **లేదా** | **11,500-00** |
| | ఆదాయం - వేరుశనగ కట్టె | స్వంత కష్టానికి సరి |
| | 70 మూటల కాయలు సంచి 1,150/- వంతున | 80,500-00 |
| | ఖర్చు | **11,500-00** |
| | **నికరాదాయం** | **69,000-00** |

అనంత జ్యోతి రకంతోపాటు, ఖర్చులేని వ్యవసాయం గురించి, పరిచయం చేసిన ఎకాలజీ సిబ్బందికి రైతు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాడు. కనీసం టీ, అప్పు ఇవ్వడానికి కూడా సంశయించేవారు, ఇపుడు అప్పులు తీసుకోమంటున్నారని, గ్రామంలో రైతుగా తనకు పరపతి పెరిగిందని నరసింహులు చెబుతున్నాడు. జీవితమంతా తాటాకుల పాక తప్ప ఎరుగని తనకు ఇందిరమ్మ ఇళ్ళ ద్వారా మరింత డబ్బులు వేసుకుని పక్కా ఇల్లు కట్టుకుంటున్నాడు. ఎకాలజీ సెంటరు సిబ్బంది సారథ్యంలో ఏర్పాటు చేసిన స్వయంమిత్ర గ్రూపులలో చాలా ఉత్సాహంగా, అనంతజ్యోతి రకాన్నీ, రసాయనిక మందులు ఎరువులు లేకుండా ఖర్చులేని వ్యవసాయం చేసుకోవడమెలాగో కూడా వివరిస్తున్నాడు.

## సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

# రైతుల ఆశాజ్యోతిగా మారిన అనంత జ్యోతి - ఒక రైతు అనుభవం

రాప్తాడు మండలంలోని మరూరు, చెర్లోపల్లి గ్రామానికి చెందిన గంథం నరసింహులు (35) కృషి, పట్టుదలకు తోడుగా ఎకాలజీ సెంటరు సిబ్బంది మార్గదర్శకత్వం, అనంతజ్యోతి వేరుశెనగ రకం తోడు కావడంతో రైతుగా నిలదొక్కుకున్నాడు. అధికర వర్షాల అతివృష్టితో జిల్లాలో వేరుశనగ పంట దిగుబబడులు లేక రైతులందరూ నష్టపోయిన సందర్భంలో నరసింహులు తన జీవితంలో సాధ్యం కాదన్నుకున్న పంట తీయగలిగాడు. అప్పులన్నీ తీర్చుకోగలిగాడు. అంతేకాదు, గ్రామంలో ఏ మాత్రం పరపతి లేకుండా బతుకుతున్న ఈ రైతుకు మంచి పంట తీయడంలో మంచి పరపతి కూడా ఏర్పడింది. ప్రస్తుతం, నరసింహులు విజయగాధను చదివే ముందు అతని గత జీవితాన్ని ఒక్కసారి పరిశీలించడం అవసరం.

నరసింహులు తండ్రి రాముడు చాలా బీద రైతు. ప్రభుత్వ బంజరు భూమిని సాగు చేసుకుంటూ గంపెడంత కుటుంబ పోషణ భారం వహించాడు. కుటుంబానికి రెండు పూటలా తిండి కూడా పండుగే. కుటుంబ సభ్యులందరూ పనుల కాలంలో కూలీకి పోయి కుటుంబం గడవడానికి సాయపడేవారు. నిత్యం కరువులతో అల్లాడుతున్న అందరి రైతులలాగే రాముడు కూడా మెట్ట వ్యవసాయంలో నష్టపోయేవాడు. అయితే తన పొలంలోనే బావి గుంత కష్టపడి తవ్వుకుని ఏతంతో అర్ధెకరా పరిమాణంలో వంకాయలు, మిర్చి, బెండ తదితర కాయగూరలు పండిస్తే, కుటుంబ సభ్యులు ఇల్లిల్లూ తిరిగి అమ్ముకునేవారు. అతిదుర్భర దారిద్ర్యం కావడంతో గ్రామంలో ఎవరూ వ్యవసాయ పెట్టుబడులకు అప్పులు కూడా ఇచ్చేవారు కారు. మిగతా పొలంలో వేరుశనగ వేసుకుందామన్నా, పంటలు పండినప్పటికీ అప్పులకు మాత్రమే సరిపోయేవి. వీరి పరిస్థితిని సొమ్ము చేసుకోవడానికి వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలకు మాత్రమే అప్పులు ఇచ్చేవారు. కుటుంబం పెద్దదయింది. ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేశారు. నరసింహలుకు కూడా పెళ్ళి చేశారు. నరసింహులుకు ప్రస్తుతం ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. గ్రామంలో తన తండ్రి చేసిన అప్పులకు 13 సంవత్సరాలు రైతుల దగ్గర పశువుల కాపరిగా జీతం ఉన్న అనుభవం కూడా ఉంది. ఇంత దుర్భర పరిస్థితులలోనూ నరసింహులు గ్రామం వీడలేదు. భూమిని వదలలేదు. తాను నమ్ముకున్న భూమి తనకు ఆదాయం ఇచ్చినా, ఇవ్వకపోయినా నరసింహులు ధైర్యం వీడలేదు. ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమంలో తమ తాత తల్లిదండ్రుల కాలం నుండీ సాగు చేసుకుంటున్న భూమికి పట్టా కూడా సంపాదించాడు. ప్రభుత్వ సాయంతో ఒక బోరు కూడా వేయించుకున్నాడు. బోరులో నీటి సౌకర్యం కలిగినా, నరసింహులు కష్టాలు మాత్రం తీరలేదు. విత్తనం దగ్గర్నుంచి, రసాయనిక ఎరువులు, పురుగు మందులకు అయ్యే ఖర్చుతో ఆదాయం అంతా హరించుక పోయేది. ఒక్కోసారి చేతుల కష్టం కూడా మిగిలేది కాదు. పంటలు వేసినప్పటి నుండి తెగుళ్ళకు మందులు అప్పులు తేవడం, అయినా పురుగు నియంత్రణలోకి రాకపోవడం జరిగేది. తాను చేసే వ్యవసాయ కష్టం తనకు తన కుటుంబానికికాక పరుల కోసం, ఎరువుల అంగళ్ళవారిని బతికించడానికి చేస్తున్నాననిపించేది.

### నరసింహులుకు కలిసి వచ్చిన అవకాశం

2008 ఖరీఫ్ సీజనుకు ముందుగా ఎకాలజీ సెంటరు సిబ్బంది గ్రామంలోని దేవాలయంలో రైతులందరినీ సమావేశపర్చారు. ఆ సమావేశంలో పంటల సరళిని, పంటలలో పెట్టుబడులు ఏ విధంగా పెరుగుతున్నది గుర్తు చేశారు. రైతులకు పంటలు పండిన సంవత్సరంలో కూడా పెరిగిన ఖర్చుల మూలంగా రసాయనిక ఎరువులు లేకుండా, రసాయనిక పురుగు మందులు వాడకుండా ఏ విధంగా పంటలు రక్షించుకోవచ్చునో వివరించారు. నామ మాత్రపు ఖర్చులలో స్వంతంగా కషాయాలు తయారు చేసుకుని రోగాలను ఏ విధంగా నియంత్రించవచ్చునో కూడా వివరించారు. దీనితో నరసింహులుకు తన పరిస్థితి అంతా కళ్ళ ముందు మెదిలింది. తన శ్రమంతా పురుగుమందుల షాపువారికి, వాటి కోసం అప్పులు ఇచ్చిన వడ్డీ వ్యాపారులను బతికించడానికే సరిపోయేది. పురుగు మందులు వాడకుండా, రసాయనిక ఎరువులు లేకుండా పంటలు తీయడం సాధ్యమా ? అన్న అనుమానం కూడా వచ్చింది. అయితే చెబుతున్నది ఆర్.డి.టి. సంస్థకు చెందినవారు. వారు రైతులకు మేలు చేయాలనే చెబుతారు కానీ మరొకటి ఉండదని భావించాడు. అదే సమావేశంలో ప్రస్తుతం ఉన్న టి.యం.వి.2 వేరుశనగ సామర్థ్యం కోల్పోయిందని, అనంతజ్యోతి అన్న కొత్త రకం వచ్చిందని, అది తెగుళ్ళకు, బెట్టకు తట్టుకుని నిలవగలదని కూడా చెప్పారు. వారు చెప్పిన విధంగానే తుచ తప్పకుండా ఆచరించాలనుకున్నాడు. రైతుగా తన అదృష్టాన్ని పరిక్షించాలనుకున్నాడు. కొత్త రకం వేరుశనగతో పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా వ్యవసాయం చేసి చూడాలనుకున్నాడు.

### అనంతజ్యోతి సాగు

ఎకాలజీ సెంటరు సిబ్బంది చెప్పిన విధంగానే వేసవిలోనే దుక్కిదున్నాడు. గొర్లమంద వారితో మాట్లాడి 2 1/2 ఎకరాల పొలంలో రెండు రోజులు గొర్రెల మంద తోలించాడు. తన పశువుల ఎరువును 4 బళ్ళు పొలానికి తోలినాడు. పక్క గ్రామమైన తలుపూరులో అనంతజ్యోతి రకం కాయ ఉన్నదని సిబ్బంది సలహా ఇవ్వడంతో అధిక వడ్డీతో కార్పొరేషన్‌లో అప్పు తెచ్చి మూట 1120/- వంతున ఆరు మూటలు తెచ్చుకున్నాడు. 250 సేర్ల విత్తనాలయినాయి. పురుగుల నుంచి రక్షణగా జొన్న, సద్ద కలిపి సరిహద్దు పంట వేశాడు. కంది, అలసంద, పెసర పంటలతో అక్కిళ్ళలో అంతర పంటలు వేశాడు. పంట మొలచిన 20-25 దినాలకు కలుపుకు ములుకుల దిండ తోలినాడు. ఇంకా మిగిలిన కలుపును తొలగించడానికి 9 మంది కూలీలతో ఆ పని పూర్తి చేయించాడు. పొలం ఏపుగా పచ్చగా

(మిగతా 3వ పేజీలో)

**చిట్కా :** టమోటాను చిన్నముక్కలుగా కోసి వాటి నుండి రసాన్ని తీసి ఉల్లిరసంతో కలిపి తాగితే, రక్తహీనత, గుండె జబ్బులు నివారణ అవుతాయి.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in